# నాన్నగారి జ్ఞాపకాలు

## - డా.గాయత్రీదేవి



1974 నుంచి దాదాపు ఒక దశాబ్దం పాటు ఆశేష ఆంధ్ర శ్రోతలనీ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి కట్టిపడేసిన కార్యక్రమం – ధర్మ సందేహాలు(వ్యాసపీఠం). ఆ కార్యక్రమం అంత ఆసక్తికరం కావడానికి ముఖ్యకారణం శ్రీ ఉషశ్రీ – ఉషశ్రీగారి గంభీరగళం, అనితరసాధ్యమైన కథనశైలి. ఆ రోజుల్లో ఆదివారం మధ్యాహ్నం ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ఈ కార్యక్రమం ప్రసారమయ్యే సమయంలో ఏ పూటకాపూట సంపాదించుకుంటే కానీ రోజుగడవని రిక్షా వాళ్ళు కూడా బేరం దొరికినా రిక్షా కట్టేవారు కాదు, కార్యక్రమం పూర్తయేవరకూ. ఏ కిళ్ళీ కొట్టు దగ్గరో చేరి, భక్తిశ్రద్ధలతో 'ధర్మసందేహాలు' కార్యక్రమం విన్నాకనే బేరం చూసుకునేవారు. అంతగా పామరులనీ పండితులనీ సమంగా ఆకర్షించింది ఆ కార్యక్రమం. ఆ ఆకర్షణ ఎంతంటే – నాలుగు దశాబ్దాల తర్వాత ఈ రోజుకి కూడా రామాయణ, భారతాల ప్రవచనాలంటే ఉషశ్రీ గారినే గుర్తుచేసుకుంటున్నారు.

ఉషశ్రీ గళానికి ఉన్న శక్తి కలానికి కూడా ఉంది. ఉషశ్రీ రాసిన రామాయణ, భాగవత, భారత కథలని చదువుతోంటే విన్నట్లే ఉంటుంది. ఆయన కలం నుండి జాలువారిన రచనలు ఒక్కొక్కటీ ఎన్నో లక్షల ప్రతులుగా ప్రజల దగ్గరకి చేరి వాళ్ళ ఇళ్ళల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఉషశ్రీగారి సాహిత్యాన్ని ఈ తరానికి అందించడంలో విశేషమైన కృషి చేస్తున్నారు, వారి కుమార్తె డా.గాయత్రీ దేవిగారు.

'నాన్నగారి జ్ఞాపకాలు' శీర్షికలో డా.గాయత్రీదేవిగారు ఉషశ్రీగారి జీవితాన్ని ఈ తరం పాఠకులకు 'కౌముది' ద్వారా అందిస్తున్నారు.

( క్రిందటి సంచిక నుంచి తరువాయి)




## మనవరాలి మాయ

తన అరవై రెండేళ్ళ జీవితంలో ఆఖరి రెండేళ్ళూ మాయలో పడిపోయారు నాన్న– మనవరాలి మాయలో.

అది నా కడుపులో మాయలో ఉన్నప్పుడే – నాన్న దాని మాయలో ఉన్నారు.

అది పుట్టడానికి ఓ రెండు నెల్ల ముందు నేను బొమ్బాయి నుండి విజయవాడ వెళ్ళాను. విమానాశ్రయానికి కారు తీసుకొచ్చేసారు నాన్న. జాగ్రత్తగా నన్నింటికి తీసికెళ్ళారు. ఆ రెండు నెల్లూ నన్నెంతో అల్లారు ముద్దుగా చూసుకున్నారు.



అది ౧౯౮౮ అక్టోబర్ ఇరవైన విజయదశమి నాడు పుట్టింది. ఆ రోజు నాన్న ఊళ్ళో లేరు. నొప్పులు మొదలైతే – మా పక్కింట్లో ఉండే ఉదయం రామచంద్రమూర్తి గారి సాయంతో – హాస్పిటలుకి వెళ్ళాం. నాకు చదువు చెప్పిన ప్రభా మేడమే – డెలివెరీ చేసిన డాక్టర్.

నాన్న ఊళ్ళోకి వస్తూనే పిల్ల ఎలా ఉందని అడిగారుట చెల్లెళ్ళని. వాళ్ళు నేను బావున్నానని చెప్పి – నువ్వు అడిగింది అక్క గురించా – అక్క పిల్ల గురించా? అని ఆరా తీస్తే – నాన్న నవ్వేసారుట.

మమ్మల్ని చూసుకుంటూ నాన్న ఎంత మురిసిపోయుంటారో నాకు తెలియదు. కానీ అపరాజితని చూసుకుని ఎంత మురిసిపోయారో నాకు తెలుసు. దాన్ని చూసి మురిసిపోతున్న నాన్నని చూస్తూ నేనెంత మురిసిపోయేదాన్నో. అది నాన్నకి తెలుసో తెలియదో. అప్పుడు చెప్పలేదు. ఇప్పుడు చెప్పలేను.

అది పుట్టినప్పుడు నువ్వు ఇంట్లో చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఇల్లంతా దాని కోసమన్నట్లే తయారు చేసేసావు. నీకు మరో లోకం లేకుండా చేసేసుకున్నావు.

ఆ సమయంలో నన్నని ఎవ్వరైనా చూస్తే గంభీర ఉపన్యాసాలు ఇచ్చే ఉషశ్రీగారేనా అని అనుకునేట్లు ఉండేవారు. అప్పటికి దానికింకా మాటలు కావు కదా కూతలు కూడా రావు. అది రోజులో చాలా భాగం నిద్రపోతూనే ఉండేది. ఐనా – రోజుల పిల్లతోనే నాన్న జీవితాన్ని అల్లేసుకున్నారు నాన్న. ఎప్పుడూ అదేం చేస్తోందీ – దానికి నేనేం చెయ్యాలా అనే ధ్యాస. దానికి ఏదన్నా అవుతుందేమోననే కంగారు.

పిల్ల పిల్ల, పిల్ల నాన్నకి ఎలా ఉంటుందో అని నాకు తెలియడానికి నాన్నే నాకు నిదర్శనం. జీవితంలో ఎందరి దగ్గరో ఎన్నో సన్మానాలు పొందినప్పుడు కూడా అంత పొంగిపోయుండరు.

పిల్లకి మూడో నెలొచ్చి మేం బొంబాయి వెళ్తోంటే నాన్న పడ్డ బాధ – తర్వాత నాన్న రాసిన ఉత్తరంలో తెలిసింది.

మనవరాలి ప్రలోభంలో ఎంతగా పడి పోయారంటే – మేం బొంబాయి నుండి వస్తున్నామంటే – దింపుకుందుకు స్టేషనుకి వచ్చేసేవారు.

వచ్చిన ప్రతీసారీ మనవరాలు కాస్త కాస్త పెద్దదయ్యేది. కూతలు కూసేది. ఆ కూతలు నాన్నకి లతా మంగేష్కర్ పాటల్లా వినిపించేవి. అది పడుక్కుని నవ్వుకునేది. ఆ నవ్వులో నాన్నకి వివేకానందం కనిపించేది. అది నా అజ్ఞానాన్ని చూసి నవ్వుతోన్న పరమహంస అని మైమరచిపోయేవారు.

దాని నామకరణం, అన్నప్రాశనా – అన్నీ పండగలే నాన్నకి. ఇంక అది ఉన్నప్పుడు ఇంట్లో పండగ వస్తే నాన్నకి పండగే పండగ.

అదింకా రోజుల పిల్లగా ఉన్నప్పుడే దీపావళికి దాని చేత కాకరపువ్వొత్తులు కాల్పించారు. సంక్రాంతికి భోగిపళ్ళు పోయించారు.

దాన్ని తన పొట్ట మీద పడుక్కోపెట్టుకుని, అది తల పైకెత్తి తన వైపు చూస్తోంటే – దైవదర్శనం ఐనంత పొంగిపోయేవారు. అలా తల పైకెత్తి అది నవ్వినా, అరిచినా – ఆనందమే ఆనందం నాన్నకి.

దాన్ని చిన్న ఉయ్యాల్లో కూచోపెట్టి ఊపుకుంటూ – ఆ ఉయ్యాల ఊపునంతా తన మొహంలో తెచ్చేసుకుని – ఆడిస్తూ – ఆడేసుకునేవారు నాన్న.

ఆ ఫొటోలు ఉన్నాయి. అప్పుడప్పుడు వాటిని తీసుకుని చూస్తుంటా నేను. మా పిల్లా చూస్తుంది. దానికి ఈ ఫొటోలంటే ఎంత ఇష్టమో.

దాన్ని ఎత్తుకుని మొక్కల మధ్య తిరిగేవారు నాన్న. అది పువ్వా పువ్వా అంటూ ఒక్కో పువ్వునీ చూపిస్తోంటే – దాన్ని ప్రతి పువ్వు దగ్గరకీ తీసికెళ్ళిపోయేవారు.

దానికి సరదాగా నేను సుందరకాండ కథలో హనుమంతుడు యాపిల్ పళ్ళూ ఆల్బకరా పళ్ళూ తిన్నట్లు చెప్తే – అది అలాగే చెప్పేది. ఎవరొచ్చినా నా మనవరాలు మోడర్న్ సుందరకాండ చెప్తోందంటూ చెప్పేవారు మురిసిపోతూ. దాని చేత చెప్పించేవాడివి. నువ్వైతే మళ్ళీ మళ్ళీ

చెప్పించుకునేవాడివి.



దాన్ని తీసుకుని నేను బొంబాయి వెళ్ళినప్పుడల్లా నాన్నకి దిగులే. ఆ దిగులు నాన్న ఉత్తరాల్లో కనిపించేది. నాన్న దాన్ని పరమహంసా అని సంబోధిస్తూ ఉత్తరాలు రాసేవారు.

భగవద్గీత ఒంట పట్టించుకున్నాననుకున్నా అని – భగవద్గీతకి మించిన వేదాంతం రాసుకున్నారు. మనవరాలికి రాసిన ఉత్తరం పేరుకి మాత్రమే – నిజానికి అది నాన్న తనకి తాను రాసుకున్న ఉత్తరమే.

మన్ని మనం తెలుసుకున్నా – మన మనోభావాలు మనకి బాగా అర్థం ఐనా – మనలో మార్పు రాడానికి అవి చాలవు.

గీతని చెప్పినవాడు జగద్గురువు. విన్నవాడు సాక్షాత్తూ నరుడు. విని యుద్ధం మొదలెట్టాడు. మారాడేమో అని అనుకుంటే – పదిహేను రోజులు కూడా కాకుండా – అభిమన్యుడు అంతమయ్యాడని తెలియగానే – ముందు దుఃఖానికీ, తర్వాత కోపానికీ లొంగిపోయాడు. సూర్యుడు కృంగేలోగా సైంధవుణ్ణి సంహరించకపోతే మరణిస్తానని శపథం చేసాడు.

జనన మరణాలు సర్వ సాధారణమనీ, వాటి గురించి పొంగి కృంగి పోవడం తగదని బోధించిన కృష్ణుడి ముందే – బావ చెప్పిందంతా మరిచిపోయి ఏడ్చాడు. ప్రతిజ్ఞ చేసాడు. అదీ మాయ.

మాయ తొలగిపోతే మనిషికి మిగిలేదేమిటో నాకైతే తెలియదు. నాన్నకి ఈపాటికి తెలిసిందేమో తెలియదు. తెలిసినా నాన్న చెప్పరు – చెప్పలేరు.

ఐతే మాయలోనూ ఆనందం ఉంది – అదే మనవరాలి మాయలో పడి అనుభవించారు నాన్న. నాకు జీవితంలో మిగిలిన పెద్ద తృప్తి – నాన్నకి నేను ఆ ఆనందాన్ని ఇవ్వడం.

తన మూడో పుట్టిన రోజుకే తాతయ్య దూరం అయినా మనవరాలు అపరాజిత ఎప్పుడూ మా నాన్నని తల్చుకుంటూనే ఉంటుంది ....

# నాన్న ఇష్టాలు

నాన్నకి ఇష్టమైన రంగు––తెలుపు

ఇష్టమైన పువ్వు –మల్లెపువ్వు

ఇష్టమైన ఆట––పిల్లలతో ఆడే ఏ ఆటైనా ఆడ్డానికి ఇష్టమే. మాతో ఆడిన అడ్డాటా...మాతో ఆడిన చింతగింజలాట కూడా

చూడ్డానికైతే క్రికెట్. కొంత హాకీ కూడా.

మనవాళ్ళలో ఇష్టమైన ఆటగాళ్ళు––పటౌడీ, గవాస్కర్, వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ మార్షల్ –

ఇష్టమైన సినిమాలు ––ఝణక్ ఝణక్ పాయల్ బాజే, దో ఆంఖేఁ బారహ్ హాథ్, చంద్రలేఖ

నచ్చిన నటులు ––బాలరాజ్ సహానీ, దిలీప్ కుమార్, శాంతారాం, హిందీ నటుడు చంద్రమోహన్

నటీమణులు –తెలుగు లొ భానుమతి

హిందీలో ఐతే సంధ్య, నర్గీస్, మీనాకుమారి

హేమమాలిని నృత్యాలంటే ఇష్టం

గాయకులు--సైగల్, లతా మంగేష్కర్

ఇష్టమైన పాట --కాలే కాలే బాదల్ గిరి గిర్ ఆగయా, ముడ్ ముడ్ న దేఖ్, సో జావో రాజకుమారీ

ఇష్టమైన కవి-- విశ్వనాథ సత్యనారాయణ

పుస్తకం--రామాయణ కల్పవృక్షం

నేను : మరి సుందరకాండ?

గురువులు--నండూరి కృష్ణమాచార్యులు గారూ, వెంపరాల సూర్యనారాయణ గారు

అన్నింటికన్నా ఇష్టమైన పదార్థం--మా అమ్మ వండింది ఏదైనా సరే

ఇష్టమయిన స్వీట్ : జున్ను, పల్లీ పట్టీలు

మరోటి--తేనెపాకంతో దిబ్బరొట్టె

కూర -- పనసపొట్టు

పులుసు--గుమ్మడికాయ ముక్కల పులుసు

పచ్చడి--కొబ్బరికాయ మావిడికాయ పచ్చడి

పండు---వేసవి లో మామిడీ, పనసా, చలికాలం లో సీతాఫలం, వానాకాలం లో నేరేడు

ఇష్టమైన ప్రదేశం-- ఇల్లు

వాహనం-సైకిల్, అంతకన్నా కూడా నడక

ఇష్టమైన పని-- తోటపని

నచ్చే అలవాటు-- రైళ్ళలో ప్రయాణం చేస్తూ చెప్పులు సీట్లకింద పెట్టేసి, చొక్కాలు హుక్కులకి తగిలించేసి హాయిగా నిద్రపోవడం. వాటిని అలా మర్చి పోయి రైలు దిగెయ్యడం.

నచ్చే స్వభావం -- ఇతరులని నిందించకపోవడం, చేసిన మేలు మరవకపోవడం

ఇలా నాన్న ఇష్టాలు గుర్తు చేసుకున్నా....

నాకు తెలిసి నాన్న ఎవ్వరినీ నిందించలేదు. ఎవరు చేసిందైనా ఎంత చిన్న మేలైనా మర్చిపోలేదు.

ఎవరికైనా సాయం చెయ్యాల్సి వస్తే ముందుండేవారు..

ఈ వ్యాసాల ఆడియోలు ఇక్కడ వినవచ్చు: Link to Audios

**మా వెబ్ సైట్స్ - ushasri.com, drgayatridevi.com**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments